అవతారిక

“ శిఖిముఖి ”

సామగానంనుంచి సోమపానంవరకూ ఊగేకుండలాలు చెవులట్టుకుని ఝూడించి అడిగేస్తున్నాయి:

“చూశావా కడ కెంతటివా డయ్యాడో?”

ఎంతటివాడయ్యాడో అంతుచిక్క లేదు అర్కసోమయాజికి.

తరంగాని పున్నామ నరకం. తీరా ఏరుదాటి తెప్పని తప్పిదాలు పట్టడనికి మన సొప్పక, పల్లెత్తుమాటన లేకపోతూ వచ్చేడు. కాని నేటికాలానికి గతించిన వైశ్యదేవ సంప్రదాయపు కులీనతను కదలించే ప్రశ్న దూసుకువస్తే, చిత్తం చివుక్కుమంది. తప్పనిసరిగా తల దించేసుకున్నాడు.

స్వరితంగా సద్దుకుంటూన్న స్వర్ణకుండలాలకి ఆయన ఆందోళనకి తగని చిలిపిగా నవ్వేసుకువచ్చింది. ఒక్కక్షణం ఆగి మళ్ళీ ఊగిసలాడేయి, ఉదాత్తంగా. కలికాలం అండచూసుకుని గద్దించేయి: “సన్నేనయ్యా! ఈపాటికి ఘుద్దుమాని, మొహం వాచేటట్లు చీవాట్లు పెట్టరాదూ?”

ఓహో అనిపించుకున్న సంప్రదాయానికి కాలమహిమ నెంతటి కళంకం వచ్చింది! అని కించపడ్డాడు. ఓకాడికి నిశ్చయానికి వచ్చేడు:

“అవును: చీవాట్లు పెట్టాలిసిందే!”

కొడుకు రాగానే కడిగెయ్యదలచుకున్న మాటల్ని బుక్కు బుక్కుగా తుణ్ణం చేసుకుని ఘనా, జటాగా పెనవేసి వల్లె వేసుకున్నాడు.

అప్పటికే చీకటి ఆరుఘళ్ల రాత్రిసి వడి కట్టుకుని జోకొడుతోంది. రాత్రి వళ్లు విరుపు కన్నగారిలా ఆవులింత వచ్చింది సోమయాజికి.

“ఇహాను రాడు!” అని కాస్త చాదస్తంగా పైకే అనుకుని, కూర్చున్నపాటునే ఓ కునుకు తీసేడు.

ఇక్కడి కిదయిందా...

అక్కడ పుత్రరత్నం పైబేస్తుమీద కుదేలయి, ఆటా పేకా చెల్లంగోరు చేసుకున్నాడు. దారి పొడుగునా దీపాల రేఖల్ని పరకాయిస్తూ, కిటికీల సందులకు కళ్లు వప్పగించి ఇంటి మొహ మయ్యాడు.

ఏ కలవారికోడలో చూరుదాపున సువ్వీ—సువ్వన్న—గా చుక్కల్ని కదలేస్తోంది. యాదాలాభంగా కలయజూచి,

"పిష్టపేషణమా, పిల్లా?" అన్నాడు. శాస్త్రం చెప్పిన తరవాయిగా.

ఏదీ కానివేళ మగగొంతులో చిన్నదానికి పెద్ద చిన్నతనం వినిపించింది. ప్రోషిత భర్తృకత్వంలో ఇంటిల్లిపాదీ తనే అయి మసిలే ఇల్లాలు, మరి. కళవళపాటులో కాని మాటలు దొర్లకుండా మునిపంటితో అధరాన్నదిమి పట్టుకుంది. సూటి తప్పిన సువ్విపోటులో రోకటిపన్ను రోటి పెదవిని కాటేసి ఖాయిదాలో ఉంచింది.

మౌనం అర్ధం అంగీకారం అని సంతృప్తి పడడని కిచ్చగించని ఘటికుడు. ప్రత్యామ్నాయాలతో పరామర్శించి, కవ్వించి కదలేయదలుచుకున్నాడు.

"మరయితే ఊకదంపుళ్లా, ఊఁ కొట్టడాలు దండుగన్నట్లు ఉలకకుండా ఉన్నావు?"

"మేకల్ని కాసి తెచ్చిన నూకలుంటే ఇలా ఇయ్యరాదూ?" ఉఫ్‌మని ఉలికించేటట్లుంది.

ఒక్కగానొక్క అంగ ముందుకు వేసి, భుజంమీద ఉత్తరీయాన్ని చేజేతులా పీకమీదకి తెచ్చుకున్నాడు.

"వయ్యారం! రోకలి చిగిర్చగలదు!"

"తలకి చుడతానని ఆశిస్తున్నావా? వెర్రివాడ!" అని మందలించింది. అరక్షణం ఆగి: "యాదవ యమునాతీరాల తుంగ సంగతి జ్ఞాపకం లేదో!" అంది.

ఒక్కచిటికెడుసేపు చిత్తయిపోయాడు.

"వాకిటి కావలి తిమ్మని వాకిట ఆకటి కవికోటి కిటికోటిగా పడివుంది, చేలా!"— మాటుపెట్టిన చాటువు చాటున చాయంగల విన్నపాలై తెరిపిన పడ్డాడు.

ప్రౌఢ బెట్టుసరి ఓమెట్టు దిగింది. అసురుసురయ్యే, తాడెత్తు ప్రమాణాన లేచిన రోకలి నలా అంతరిక్షంలోనే అట్టే పట్టుకుని, కుడిభుజంమీద కిలకిలలాడింది. చూపులవెంబడే సరసను జేరి సరసాలాపడం మొదలెట్టేడు కడ కెంతటివాడో అయిన అతగాడు.

"ఎగ్గైనా లేదూ? ఎవరేనా చూస్తారు!" చిరుకోపించిం దామె.

"చూసేవాళ్ళకి సిగ్గుండొద్దూ?"

"నీకేం, మగరాయడివి. లోకులు కాకులు కదూ?"

"అయితే, వాళ్ళతో 'కావు, కావు' కొట్టేస్తే సరీ! అయినా ఈపాటి బెంబేలు పడేదానివే ఇంత కవ్వించావు దేనికి?"

"శ్రావణీల రాత్రులు. బొత్తిగా ఒంటరిదాన్నైన్ని చిన్నబోయానుగదా అని ఉలికించేనే అనుకో. అయితే మాత్రం ఇంత ఆగడమా? లంకకు చేటుగా వ్యవహరించాలా?"—ఇంటి గుట్టుగా గుసగుసలాడింది.

సమాధానపడి ఛాయలోనికి సర్దుకున్నాడు. "మరయితే..." లోమాట కొణుగోయింది.

"రేపు రారాదా, రాజా!" జవ్వరాలి కన్బొమలు విల్లొంగి హావభావాలయాయి.

పడతి చెక్కిలిమీద రేపటి రేఖా చిత్రాన్ని ఊహాలూ, చూపులూ గుచ్చెత్తి గీసుకొని, చిత్రం చుక్కా, చారా చామన ఛాయకి హత్తుగున్నాయని మనసుకు పట్టేక ఇంటిదారి పట్టేడు.

* * * *

సోమిదమ్మ గది తలుపు కిక్కురు మనకుండా ఓరవాకిలయింది. పరంజాగూట్లో పరంజ్యోతి కంటి వత్తిపెట్టుకొని చూసింది. గాలివాలున కదిలి కళవళపడింది.

కాసింత గాలి అలికిడికి కలభిన్నం చెదరంగా చితికిపోగా, కలవరింతలా లేచి కూర్చుంది సోమిదమ్మ.

"గోపికల ఇళ్ళకి పోబోకు, నాయనా. గోరంతలమీద కొండంతలు నిలబెట్టలేవు. తండ్రీ!"—తాహతు మాలిన గొంతులో తల్లి వాడిగా సలహా చెప్పింది.

"అపరాధమంతా అటకాయించిన అతివదేనమ్మా."

అడ్డబాస ముక్కున ముత్యం కట్టుకుని ముసిముసినవ్వు నవ్వింది. తప్పు తుడిచి తల నిమిరింది తల్లి. కన్నకడుపెడు ప్రేమతో కడుపునిండా బువ్వపెట్టి కంటినిండా నిద్ర బుచ్చింది.

కొడిగట్టిన దీపం కొరకొరగా చూసి, కన్నార్పి, గదినిండే చీకటి కునుకుతీసింది.

* * * *

అహల్యల అందాలవైపుకు ఊహాల్ని తిప్పుతూ, "కొక్కొరోకో" అంది కోడిపుంజు. కూతవేటుకి బ్రహ్మనాయుడంతటివాళ్ళు భయపడి లేచేరు. అలనాటి పలనాడంతా అదిరి దద్దరిల్లింది.

తెల్లగా తెల్లవార్చుకుని రేపు చక్కా వచ్చింది.

పావంచాల రేవు పెళ్ళివారి విడిదిలాగ క్రిక్కిరిసి ఉంది. కలికాలపు చలిగాడుపు ఈదురోమంటూ వీచింది. గట్టుమీద ఘనాపాఠీల శాలువాల క్రింద అంగుష్ఠపు కవళికలో గాయత్రి గజగజలాడింది.

మొలబంటి నీటిలో అగస్త్యభ్రాత లాచమనం చేస్తున్నారు. అలలు రేగిన నీటికి నాచు తెగులు లణిగింది.

చలికి జడిసి మబ్బు ముసుగు బిగించిన ఆదిత్యబ్రహ్మ మొహాన్న తలో ఇన్ని నీళ్ళు చిలకరించి లేపి తీసేరు బ్రాహ్మణ్యులు.

భగవాన్లుకి ఒళ్ళు మండుకొచ్చి చుర్రుమన్నాడు. ఎండపొడ తగిలేటప్పటికి యాజికి కోపం జ్ఞాపకమొచ్చింది. ("అవును. చీవాట్లు పెట్టాలిసిందే.")

నిత్యం, నైమిత్తికం ముగించుకుని, చరచరా ఇల్లు జేరి, సోదెమ్మకి పిలుపెట్టేడు

"పక్షీ!"

కళాపి కలాపంలో ఉన్న పాపి మాట వినిపించుకోలేదు.

"నిన్నే! మన భేద వేడీ?"

యాజి నడినెత్తిన అంగవస్త్రం పిడప ఎటు మొగ్గాలో తెలియక తికమకపడింది. ఆయన తన విషయాన్ని సూత్రప్రాయంగా చింతన చేసుకున్నాడు: "అవును. చీవాట్లు పెట్టాలిసిందే!"

గంగాళంలో గాజులు గిలకరించి, సోమిదమ్మ కొడుకును పలకరించింది.

"నీ పొత్తిళ్ళలో పెట్టి కాపాడవే. చచ్చి నీ కడుపున పుడతానే!"-బావురుమన్నాడు భడవ.

నాలుగంగలలో యాజులే అక్కడకు వచ్చి ఖస్సుమని నిలబడ్డాడు.

"సంధ్యా, విద్యా? బహుద్ధాయి! ఆగమ్మ కాకిలా అగ్రహారాలేగడం మాత్రం చేతనయింది. అప్రాచ్యుడా! కులభ్రష్టుడవి!"

చెట్టంత కొడుకును పట్టుకొని రెమ్మ రెమ్మగా...ఇలా దులపరించేశాడు.

"కాదండి..." మాట పెగిలి అడ్డుపడబోయింది.

"ఛీ! వాజీ..."

తల్లిచాటు పాపడు తప్పాల తడకలా జవజవలాడిపోయేడు.

"అగ్నిహోత్రం లాంటి వంశగౌరవాన్ని మంటగలిపేవు గదరా, తుచ్ఛుడా!...నడు, నా పంచనుంచి...కదలవేం?"

కుర్రవాడి గుండె గుబుక్కుమంది.

[అనగనగా వెనకటికీ ఇంతే అయిందిలే, ఒకానొకణ్ణి ఇంట్లోంచి పొమ్మంటే, జూదాలాడి కుబేరుడయ్యాడు జన్మనీకి శివరాత్రిగా ఒకటో అరో వత్తి ముట్టించి—అని ఓదార్చింది శ్రుతపాండితి.]

తెగించి గడపదాటి కాశీఅంత అంగేసి ప్రజల్లో పడ్డాడు. కన్నతల్లి కడుపు తరుక్కుంటూ చరచరా చక్కాపోయేడు.

* * * *

అరమోడ్పుగా కనుచీకటి పడింది. మాట తప్పని మగరాజు హాజరు.

"కాస్త చిరునవ్వు చిదిపి దీపం పెట్టుకోరాదూ?" అన్నాడు మసక-మసకగా మాట కలుపుతూ.

"కన్నెచీకట్లని కౌగలించుకుంటూ వస్తావని కలగనలేదు!"

"రెప్పపాటు కాలమయినా కునుకు తీయలేని వాలుచూపుల వాసకసజ్జికవు మరి! కల లెక్కడినుంచి వస్తాయి?"

చుబుకం పుణికి, చెంపను ముద్దాడేడు.

"సరసుడివి పో!" పట్టు విదిలించుకుంది.

ఉభయులూ గృహప్రవేశమయి దీపారాధన చేసుకున్నారు. పడకటింటి మర్యాద లెరిగిన ప్రౌఢ పాను పమిర్చింది.

"...కనికారమెరుగని ఊళ్ళో కటికరాత్రులు గడుపుతూ వచ్చేను..." కంట తడిపెట్టుకుంది (వది) నా అన్నవాళ్లు లేని వయ్యారి.

ప్రౌఢదేమో మాట పెళుసు, విరుచుకు తిందామని వచ్చేడు: తీరా ఇలా నాన్పుడయేసరికి ఛీత్కార మేసుకొచ్చింది.

"ఏడిస్తే నీకళ్లు నీలాలు కావూ!" అనునయించేడు.

"నీలాలు కారితే నువ్వు చూడలేవా?"

"నీ రెక్క నీ కంటిపాప పువ్వు పూస్తే అర్ధరాజ్యాలిచ్చే దాతయినా లేడుగదా!"

"కాళిదాసుకన్న ఒక పూ వెక్కువే చదువుకున్నావే?" అంది ఇందీవరద్వయం మెరిపిస్తూ భుజాలు రాపాడించి అభినందించింది.

గూడెక్కిన గువ్వల కథలన్నీ చెప్పుకుంటూ, తల మునకల తలంబ్రాలుగా నవ్వుకున్నారు ప్రియులు...గోట చిదిమిన గోరింటల రంగు పూసి చెక్కిళ్ళమీద చిమ్మిస్తూ నిద్రపోయిందా యిల్లాలు.

*　　*　　*　　*

ఆ అయినింటి ఆడుపడుచు లేచేటప్పటికి చుక్కలు దాల్చి సూరీడు పొడిచేడు. అత్తగాడు ఆఖరి శృంగార మర్యాదల నంది పుచ్చుకుని దొరికిన దారల్లా తొక్కుకుంటూ పోయాడు.

ఆకాశంలో ఆ మేఘం ఈ మేఘం కూడబలుక్కుని వళ్లు జల్లుమనే శ్లోక జడి చినుకుల్ని గుమ్మరించేయి. చినుకు చినుకు గాలివానయింది.

శ్రావణ భాద్రపదాలకి జడిసి ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటిమీద వాలకపోవడం మూలాన్న తనేమైనదీ తల్లికి కాకమ్మ చేతైన కబురంపలేదా రాజు.

తరువాత తరువాత,

"పల్లెటూళ్ళో తల్లి కేదో
పాడుకల్లో పేగు కదలింది"

అని మాత్రం అనుకున్న పాపాన్న పోయిందట లోకం.

[ఇంతవరకూ కథ మొదలందిచ్చేను. కడమ భోలెడు తరవాయిసీ ఏ పేదరాసి పెద్దమ్మను కదలేసినా కంచె కెళ్లేవరకూ చెప్పెయ్యగలదు. మరి నాకు సెలవు.]

"What is truth?" అని అడిగాడట Jesting Pilate అడిగి, సమాధానంకోసం ఆగకుండా వెళ్ళిపోయాడట. ఆ కాలంలో ఆ ప్రత్యేక సందర్భంలో అతని వెటకారం అతనికున్న విశేషజ్ఞాన్ని సమర్థించేటంత హాస్యం కలిగించి ఉండాలి. పంధొమ్మిది శతాబ్దాల తరువాత Wilde కాకతాళీయంగా దానికిచ్చిన సమాధానం—"Truth is entirely and absolutely a matter of style"—మరొక రకపు హాస్యాన్ని కలిగించింది. సమాధానంకోసం ఇన్నేళ్ళు ఆగాలిసి వస్తుందని తెలిసే, అంత patience లేకపోవడం మూలాన్ని Pilate చక్కా పోయేడని ఆ రెండు అసంబద్ధ వాక్యాలని సంపుటపరిస్తే వేరొక రకపు ఆహ్లాదం కలుగుతుందనుకుంటాను.

సరే—"What is delight?" ఇదెవ్వరూ అడగనూ లేదు. జవాబు చెప్పనూ లేదు. కాని వ్యక్తుల భిన్నరుచుల కారణంగా ఆహ్లాదం అన్నమాట ఎంత అనిర్వచనీయంగా తయారయిందో ఈ, Priestley వాక్యాలను చూస్తే తెలుస్తుంది. "Delight No 74. From some of our windows, on a clear night, I can see the flashes of three light houses. So what? I don't know; and don't feel like arguing about it. Try some other page!"—

సాహిత్యంలోనూ అంతే అనిపిస్తుంది. ఒకప్పుడు పుష్టియైన కథావస్తువో, అలంకార భూయిష్టమయిన నారికేళ పాకాలలో, ఉంటే తప్ప రచన సహృదయులకి ఆహ్లాదం కలిగించేది కాదు. కాని ఈ కాలంలో అనుయాయితగా వచ్చే జాతీయాలను గాని, లోకోక్తులను గాని, twist చెయ్యడంలో, రచనలో కొత్త తమాషాలు పోవడంలో, చివరికి కథలు గాని కథలు వ్రాయడంలో కూడా ఒక కొత్తరకపు ఆనందం వ్యక్తమవుతోంది.

stephen Dedalus Shakespeare ను గూర్చి మాట్లాడుతూ, "If Bill (William) had a will Anne hath a way (Anne Hathaway)—మాటవిరిస్తే, తమాషాగా అనిపించింది. (Ulysses, Huxley, 'How do you know that our Earth is not another planet's hell?" అని అడిగిన daring, shocking, suggestion యొక్క horror లో కూడా ఆనందం వుంది.